నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 5 సెప్టెంబర్ 2024 | HYDERABAD

దంచికొట్టిన వాన

పంజాగుట్ట ఫ్లై ఓవర్‌పై పగిలిన పైప్‌లైన్‌తో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): నగరంలో బుధవారం రాత్రి వరుణుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఉన్నట్టుండి రాత్రి పదిన్నర గంటల నుంచి వర్షం దంచికొట్టింది. బంజారాహిల్స్, హైటెక్‌సిటీ, బేగంపేట, మెహిదీపట్నం, కోఠి, సికింద్రాబాద్, దిల్‌సుక్‌నగర్ తదితర ప్రాంతాల రోడ్లన్నీ జలమయమయ్యాయి. నాలాలు పొంగిపొర్లాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. ఇదిలా ఉంటే నైరుతి రుతుపవనాల ప్రభావంతో మరో రెండు రోజులు గ్రేటర్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖాధికారులు తెలిపారు. నగరంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.5డిగ్రీలు, గాలిలో తేమ 79% నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే నీటి పైప్‌లైన్ పగలగా పంజాగుట్ట ఫ్లై ఓవర్‌పై, దూల్‌పేట్ నుంచి మేడ్చల్‌కు వినాయకుడిని తరలిస్తుండగా ట్యాంక్‌బండ్ రోడ్డు మార్గంలో కిందపడి పోగా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది.

గ్రేటర్‌లో బస్సుల సంఖ్య పెంచాలంటూ.. సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఇప్పటి వరకు సుమారు 2 లక్షల మంది సంతకాలు చేశారు. 40 సెంటర్లను సంతకాల సేకరణ వేదికలుగా ఎంపిక చేసి అభిప్రాయాలను తెలుసుకొని.. సంతకాలు తీసుకుంటున్నట్లు సీపీఎం నేత శ్రీనివాస్ తెలిపారు. -సిటీబ్యూరో

విల్లాల్లోకి వరద

తూము, అలుగు నీటి కాల్వపై టవర్లు నిర్మించడమే కారణమంటున్న విల్లావాసులు

దుండిగల్, సెప్టెంబర్ 4: అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లిలోని శ్రీరాం అయోధ్య విల్లాలు నీటమునిగాయి. కాలనీ వీధుల్లో వరద నీరు పోటెత్తడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వరద ప్రవాహంలో ఇండ్ల ముందు ఉన్న కార్లు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. దీని కితోడు రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. బహదూర్‌పల్లిలోని సర్వేనంబర్ 182, 183, 184, 186, 188.189, 191, 192, 193, 208, 210ల్లోని సుమారు ఐదెకరాల ప్రైవేట్‌భూమిలో ప్రైమార్క్ అనే నిర్మాణ సంస్థ హెచ్ఎండీఏ అనుమతులతో 2019లో బహుళ అంతస్తు (టవర్లు)ల నిర్మాణాలు చేపట్టింది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ నిర్మాణదారుడు బొబ్బాఖాన్ చెరువు అలుగు, తూము నీటి కాలువను మూసివేయడంతో వానాకాలంలో వచ్చే వరదనీరు ఎటూ వెళ్లే దారిలేక పక్కనే దిగువనే ఉన్న శ్రీరాం అయోధ్య విల్లాలను ముంచెత్తుతున్నదని విల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూము, అలుగు నీటి కాల్వను మూసివేసి..దానిపై టవర్లు నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. గతేడాది సైతం ఇదే తరహాలో వానలు కురిసినప్పుడు ఇబ్బందులు పడ్డామన్నారు. గతంలో ఉన్న కాలువను పునరుద్ధరించి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేని ఫలితంగా తాము ముంపు బారినపడ్డామని చెప్పారు.

మంగళ వారం రాత్రి కురిసిన వర్షంతో బహదూర్‌పల్లిలోని శ్రీరాం అయోధ్య విల్లాల్లోని వీధుల్లో ప్రవహిస్తున్న వరదనీరు



13 చెరువులు.. 1100 ఆక్రమణలు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమించి భవనాలు

అత్యధికంగా దుర్గం చెరువు చుట్టూ 204 కట్టడాలు

200 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణకు మరో 2 నెలలు

ఒకప్పుడు లేక్‌సిటీగా పేరొందిన హైదరాబాద్.. కబ్జాలతో ఆ ఖ్యాతి కాలగర్భంలో కలిసిపోతున్నది.యథేచ్ఛగా జరుగుతున్న ఆక్రమణలతో నగరంలో చెరువులు, కుంటలు లేకుండాపోతున్నాయి. భవిష్యత్‌లో మహానగరం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్‌జోన్ల నిర్ధారణ పూర్తి చేసి ఉంటే.. చెరువులకు రక్షణగా ఉండేది. కానీ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో తటాకాలు అక్రమ నిర్మాణాలకు నిలయాలుగా మారిపోయాయి. ఇదిలా ఉంటే హెచ్ఎండీ పరిధిలో 13 చెరువుల్లో 1100 ఆక్రమణలు ఉన్నట్లు తేలింది. ఒక్క దుర్గం చెరువు చుట్టే అత్యధికంగా 204 నిర్మాణాలు బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉండటం గమనార్హం.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ)

హెచ్ఎండీఏలో 13 చెరువుల పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. అధికారులు ఇప్పటికే ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ నిర్ధారణ పూర్తి చేసి ఉంటే చెరువులకు రక్షణగా ఉండేది. కానీ హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాలకు తటాకాలు నిలయాలుగా మారాయి. దీంతో హెచ్ఎండీఏలోని 13 చెరువుల పరిధిలో 1100 ఆక్రమణలు జరిగినట్లు తేలింది. తాజాగా, హెచ్ఎండీఏ అధికారులను హైకోర్టు ఆదేశిస్తూ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ డీమార్కేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో.. క్షేత్రస్థాయిలోని జిల్లా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. నివేదికలు రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన వాటిల్లో హెచ్ఎండీఏ పరిధిలోని దుర్గం చెరువు చుట్టూ అత్యధికంగా 204 నిర్మాణాలు బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్లు తేల్చారు.

సమన్వయలోపం..చెరువుల పాలిట శాపంగా..

అధికారుల నిర్లక్ష్యం, శాఖల మధ్య సమన్వయలోపం హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల పాలిట శాపంగా మారుతున్నది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో అనధికారిక భవనాలు, నిర్మాణాలు చెరువుల పరిధిలో భారీగా ఉన్నట్లు తేల్చారు. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై మరింత లోతుగా విశ్లేషించేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా దుర్గం చెరువు చుట్టూ ఉన్న కబ్జాలపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో... హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే దుర్గం చెరువు తరహాలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉన్న చెరువులను తనిఖీలు చేయడంతోపాటు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రక్రియ పూర్తి చేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.

మరో రెండు నెలల్లో..

అగస్టు 1 నాటికి 51 చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయగా, మిగిలిన 200 చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ల నిర్ధారణ ఫైనల్ నోటిఫికేషన్‌కు మరో రెండు నెలల్లో పూర్తి చేయాలనే ఆదేశాలున్నాయి. ఇప్పటివరకు ఉన్న ప్రిలిమినరీ, ఫైనల్ నోటిఫికేషన్ మధ్య కాల వ్యవధి ఆధారంగా పర్యవేక్షించనున్నారు.

నేడు మహాగణపతికి నేత్రాలంకరణ

సిటీబ్యూరో/ఖైరతాబాద్ : ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో రూపు దిద్దుకున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి విగ్రహానికి గురువారం నేత్రాలంకరణ చేయనున్నారు. శిల్పి చిన్న స్వామి రాజేంద్రన్ నేతృత్వంలో సుమారు 200 మంది కార్మికులు నెల న్నర రోజుల్లో 70 అడుగుల విగ్రహాన్ని అన్ని హంగులతో పూర్తి చేశారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో స్వామి వారికి శిల్పి రాజేంద్రన్ నేత్రాలంకరణ చేస్తారు. విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కర్రలను పూర్తిగా తొలగించి.. సాయంత్రం 4గంటల నుంచే స్వామి వారి దర్శనం కల్పిస్తామని ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్ తెలిపారు.

మట్టి గణపతుల పంపిణీ షురూ

హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో బుధవారం కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేశారు. గ్రేటర్‌లో 36 ప్రాంతాల్లో 1లక్ష విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

కేబీఆర్ ప్రాంగణంలో

మల్టీ పార్కింగ్

కేబీఆర్ పార్కు ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాన్ని బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. కేబీఆర్ పార్కు వద్ద పార్కింగ్, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పీపీపీ విధానంలో ఈ పార్కింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఆగస్టు 2 న చేసిన తీర్మానం మేరకు స్టాండింగ్ కమిటీ సభ్యులు అధికారులతో కలిసి సంబంధిత పార్కింగ్ స్థలాన్ని సందర్శించారు.

-జూబ్లీహిల్స్

మ్యాప్‌ను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

ఓల్డ్‌సిటీలో రోడ్ల విస్తరణ

ఫ్లై ఓవర్ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి

కొత్త ప్రతిపాదనలను పరిశీలించిన కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో : గ్రేటర్ ప్రధాన ట్రాఫిక్ కారిడార్లలో రద్దీ తగ్గించడం, రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ దృష్టి సారించిందని కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. చార్మినార్ జోన్‌లో పట్టణ మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చార్మినార్ జోన్‌లో పలు ప్రాంతాల్లో ప్రతిపాదిత రోడ్డు విస్తరణ, అభివృద్ధి, ఫ్లై ఓవర్ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. బెంగళూరు నేషనల్ హైవే నుంచి శాస్త్రీపురం జంక్షన్ వరకు 100 అడుగుల రహదారి విస్తరణ అభివృద్ధి, శాస్త్రీపురం జంక్షన్ నుంచి ఇంజన్ బౌలి వరకు 100 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేయడం, అజీం హోటల్ నుంచి చర్చి గేట్ వరకు (షోహెబ్ హోటల్ నుంచి బాలాపూర్ రోడ్ వరకు 80 అడుగుల వెడల్పు రోడ్డు విస్తరణ, అభివృద్ధి, చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్ నుంచి చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ మీదుగా బార్కాస్ రోడ్ వరకు 60 అడుగుల రహదారి విస్తరణ, అభివృద్ధి, లక్కీ స్టార్ హోటల్ నుంచి పూల్ బాగ్ మీదుగా హఫీజ్‌బాబానగర్ వరకు 60, 40 అడుగుల వెడల్పు గల రహదారిని విస్తరించడం, అభివృద్ధి చేయడం, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు రోడ్డు విస్తరణపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హఫీజ్ బాబానగర్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం, బండ్లగూడ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్, ఒవైసీ జంక్షన్ వద్ద ఎడమ వైపు డౌన్ ర్యాంపు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అంటువ్యాధుల చికిత్సకు..

నిమ్స్‌లో స్పెషల్ ఓపీ

కన్సల్టేషన్ కోసం అదనంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): అంటువ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, టీబీ, హెచ్ఐవీ తదితర ఇన్‌ఫెక్షన్లతో బాధపడే రోగుల కోసం నిమ్స్ వైద్యశాలలో ప్రత్యేక ఓపీ అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈ సమస్యలతో బాధపడే రోగులకు జనరల్ మెడిసిన్ విభాగం ద్వారానే చికిత్స అందించేవారు. అయితే ఇతర రోగులతో పాటు అంటువ్యాధుల రోగులు కూడా జనరల్ మెడిసిన్ విభాగానికే వస్తుండటంతో రద్దీ కారణంగా ఇబ్బందులొస్తున్నాయి. అంతేకాకుండా అంటువ్యాధులు ఇతర రోగులకు కూడా వ్యాపించే అవకాశం ఉంటున్నది. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా చాలా మంది దీర్ఘకాలికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అంటు వ్యాధిగ్రస్తులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో దవాఖానలో అంటు వ్యాధుల నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. ఈ ఓపీ సేవల కోసం ప్రత్యేకంగా ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించినట్లు తెలిపారు.

ప్రతి మంగళ, గురువారాల్లో..

అంటువ్యాధులు, డెంగీ వంటి విషజ్వర బాధితులకు ప్రతి మంగళ, గురువారాల్లో ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ రిజిస్ట్రేషన్ ఉంటుందని, నిర్ణీత సమయం లోపు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రోగులందరికీ ఓపీ సేవలను అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

అవసరమైతే ప్రత్యేక ఐసీయూ

రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో అంటువ్యాధిగ్రస్తులకు కోసం ప్రత్యేక ఓపీని ఏర్పాటు చేశాం. అంతేకాకుండా వైద్యులపై భారం పడకుండా ఈ ప్రత్యేక ఓపీ కోసం అదనంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యుడిని నియమించాం. ఇన్‌ఫెక్షన్ల వల్ల ఎవరూ అనారోగ్యానికి గురికాకుండా సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే ప్రత్యేకంగా ఐసీయూ వార్డును కూడా ఏర్పాటు చేస్తాం. - డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

విలీనంపై విముఖత

ఘాన్సీమియాగూడ గ్రామస్తుల వినతి

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 4 : 'మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయవద్దు' అంటూ.. ఘాన్సీమియాగూడ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. గ్రామస్తులకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ప్రత్యేకాధికారి వాల్యానాయక్ కలిసి మున్సిపాలిటీలో విలీనం కోసం తీర్మాన పత్రాలను ఉన్నతాధికారులకు అందించినట్లు వివరించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో కనీసం గ్రామసభ ఏర్పాటు చేసి.. ప్రజలకు తెలుపాల్సిన అధికారులు ఎవరికీ తెలియకుండా తీర్మానం పంపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా తీర్మాన పత్రాలను పంపిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఘాన్సీమియాగూడను మున్సిపాలిటీలో విలీనం చేయకుండా గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయత్‌రాజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తామన్నారు. సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో చిలకమర్రి మహేందర్,ఆనంద్ ముదిరాజ్, ఇమ్రాన్, రవీందర్ గౌడ్, మల్లేశ్, నందం, రాజు, సురేశ్‌గౌడ్, ప్రభు తదితరులు ఉన్నారు.

తెట్లకుంటను కాపాడండి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి

మల్కాజిగిరి, సెప్టెంబర్ 4: తెట్లకుంట చెరువు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్‌కు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, లైబ్రరీ భవనానికి స్థలం, కౌకూర్ తెట్లకుంట చెరువు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మల్కాజిగిరిలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి స్థలం, ఆర్‌కేపురం చెరువు సుందరీకరణ, రాఘవేంద్రకాలనీలో ప్లే గ్రౌండ్, ముదిరాజ్ భవన నిర్మాణం చేపట్టాలని తెలిపారు. మౌలాలి భరత్‌నగర్‌తో పాటు అవసరమైన బస్తీల్లో బస్తీ దవఖానలు ఏర్పాటు చేయాలని వివరించారు. ఇప్పటికే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోసం మల్కాజిగిరి చౌరస్తాలోని ఇందిరా భవన్‌లో తాత్కాలిక కార్యాలయం కేటాయించాలని గతంలోనే కోరామని, ఇప్పటికీ ప్రభుత్వం నుంచి సమాధానం లేదన్నారు.

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మార్కెట్లోకి నకిలీ డీ-కాల్షియం మాత్రలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): చైనాకు చెందిన గ్జిన్ఫా ఫార్మస్యూటికల్ కంపెనీ పేరుతో రాష్ట్రంలోని మార్కెట్లో నకిలీ డీ-కాల్షియం పాంటొతెనేట్ మాత్రలు చెలామణి అవుతున్నాయని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. వాస్తవానికి గ్జిన్ఫా ఫార్మస్యూటికల్ కంపెనీ పేరుతో ఎలాంటి డ్రగ్ తయారు కాలేదని, అసాంఘీక శక్తులు సదరు కంపెనీ పేరుతో నకిలీ ఔషధాలను తయారు చేసి ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు గ్జిన్ఫా ఫార్మా కంపెనీ పేరుతో మార్కెట్లో చలామణి అవుతున్న డీ-కాల్షియం ఔషధాలను వినియోగించవద్దని, వీటి అమ్మకాలను సైతం వెంటనే నిలిపివేయాలని అన్ని ఫార్మా ఏజెన్సీలు, షాపులను ఆదేశించారు.